కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

అర్ధనారీశ్వర స్తోత్రమ్ - భావార్థముతో.

(శ్రీ శంకరాచార్య విరచిత)



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ శంకరాచార్య విరచిత

అర్ధనారీశ్వర స్తోత్రమ్

01. చాంపేయ గౌరార్ధ శరీరకాయై
కర్పూర గౌరార్ధ శరీరకాయ।
ధమ్మిల్లకాయై చ జటాధరాయ
నమః శివాయై చ నమః శివాయ॥

సంపెంగ పువ్వువలే ఎర్రనైన అర్ధ శరీరము కలది - కొప్పు ధరించినది అగు పార్వతికి, కర్పూరము వలే తెల్లనైన అర్ధశరీరము కలవాడు - జటాజూటము ధరించినవాడు అగు శివునకు నమస్కారము.

ఒకవైపు ఎరుపు రంగు కాంతితో మెరిసిపోతున్న అమ్మ, మరొకవైపు తెల్లని కర్పూర కాంతితో వెలుగుతున్న అయ్య, ఒకవైపు సుందరమైన కొప్పు కలిగిన అమ్మ, మరొకవైపు జటాజూటము కలిగిన అయ్య - ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

02. కస్తూరికా కుంకుమ చర్చితాయై
చితారజఃపుఞ్జ విచర్చితాయ।
కృతస్మరాయై వికృతస్మరాయ
నమః శివాయై చ నమః శివాయ॥

కస్తూరీ - కుంకుమలను శరీరముపై పూసుకున్నది - మన్మథుని బ్రతికించినది అగు పార్వతికి, చితిలోని భస్మమును పూసుకున్నవాడు - మన్మథుని సంహరించిన వాడు అగు శివునకు నమస్కారము.

ఒకవైపు కస్తూరిని ఫాలభాగమున, నుదుట కుంకుమను ధరించిన అమ్మ, మరొకవైపు చితాభస్మమును శరీరమంతా ధరించిన అయ్య, ఒకవైపు మన్మధుని సంహరించిన అయ్య, మరొకవైపు అదే మన్మధుని బ్రతికించిన అమ్మ, – ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

03. ఝుణత్క్వణత్కంకణ నూపురాయై
పాదాబ్జరాజత్ఫణి నూపురాయ।
హేమాంగదాయై భుజగాంగదాయ
నమః శివాయై చ నమః శివాయ॥

ఝుణ ఝుణమని మ్రోగు కంకణములు – అందెలు, బంగారు భుజకీర్తులు ధరించిన పార్వతికి, పాములను పాదములందు కడియములుగానూ – చేతులందు కేయూరములుగానూ ధరించిన శివునకు నమస్కారము.

ఒకవైపు ఘల్లు ఘల్లుమనే కంకణములు చేతులకు, భుజకీర్తులు భుజములకు అందెలు కాళ్ళకు ధరించిన అమ్మ, మరొకవైపు నాగులను పాదములకు, హస్తములకు, ఆభరణములుగా ధరించిన అయ్య, – ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

04. విశాలనీలోత్పల లోచనాయై
వికాసిపంకేరుహ లోచనాయ।
సమేక్షణాయై విషమేక్షణాయ
నమః శివాయై చ నమః శివాయ॥

విశాలమైన నల్లకలువలవంటి కన్నులు కలది – రెండు కన్నులున్నది అగు పార్వతికి, వికసించిన ఎర్రతామరలవంటి కన్నులు కలవాడు – మూడు కన్నుల వాడు అగు శివునకు నమస్కారము.

ఒకవైపు విశాలమైన నల్లటి కలువలను బోలిన చల్లని కళ్ళతో అమ్మ, మరొకవైపు పూర్తి వికసించిన ఎర్రని తామరలవంటి త్రినేత్రములతో అయ్య. - ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్థనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

05. మందారమాలా కలితాలకాయై
కపాలమాలాంకిత కంధరాయ।
దివ్యాంబరాయై చ దిగంబరాయ
నమః శివాయై చ నమః శివాయ॥

మందారమాలను కురులలో అలంకరించుకున్నది - దివ్య వస్త్రములను ధరించినది అగు పార్వతికి, మెడలో కపాలమాలను అలంకరించుకున్నవాడు - దిగంబరుడు అగు శివునకు నమస్కారము.

ఒకవైపు ఎర్రటి మందార పుష్పమాలను ధరించి, మెరిసిపోయే దివ్యమైన వస్త్రాలను ధరించిన అమ్మ, మరొకవైపు కపాలమాలను ధరించి దిగంబరుడైన అయ్య. - ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్థనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

06. అంభోధరశ్యామల కున్తలాయై
తటిత్ప్రభాతామ్ర జటాధరాయ।
నిరీశ్వరాయై నిఖిలేశ్వరాయ
నమః శివాయై చ నమః శివాయ॥

మబ్బువంటి నల్లని కేశములు కలది - తనకంటే గొప్పవారు లేనిది అగు పార్వతికి, మెరుస్తున్న రాగిరంగు జటాజూటము కలవాడు - అందరికంటే గొప్పవాడు అగు శివునకు నమస్కారము.

ఒకవైపు దట్టమైన నల్లని మేఘములను పోలిన కేశములు కలిగిన శక్తి స్వరూపిణి యైన అమ్మ, మరొకవైపు రాగి రంగు జటాజూటము కలిగిన శివ స్వరూపుడైన అయ్య - ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

07. ప్రపంచసృష్ట్యున్ ముఖలాస్యకాయై
సమస్తసంహారక తాండవాయ।
జగజ్జనన్యై జగదేకపిత్రే
నమః శివాయై చ నమః శివాయ॥

ప్రపంచమును సృష్టించుటకు ఉన్ముఖమైన లలిత నృత్యము చేయు జగన్మాతయగు పార్వతికి, సమస్తమును సంహరించు ప్రచండ తాండవము చేయు జగత్పితయగు శివునకు నమస్కారము.

ఒకవైపు సృష్టి ప్రారంభ సమయంలో లాస్యం చేసే జగన్మాత అమ్మ, మరొకవైపు సృష్టి సంహార సమయంలో తాండవం చేసే జగత్పిత అయిన అయ్య– ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

08. ప్రదీప్తరత్నోజ్జ్వల కుండలాయై
స్ఫురన్మహాపన్నగ భూషణాయ।
శివాన్వితాయై చ శివాన్వితాయ
నమః శివాయై చ నమః శివాయ॥

ప్రకాశించు రత్నకుండలములు ధరించినది - శివునితో కలసినది అగు పార్వతికి, శోభిల్లు మహాసర్పములను అలంకరించు కున్నవాడు - పార్వతితో కలసిన వాడు అగు శివునకు నమస్కారము.

ఒకవైపు ఉజ్జ్వలమైన కాంతితో మెరిసిపోయే రత్నకుండలములు ధరించిన శివునితో కలసిన పార్వతి, మరొకప్రక్క మహా సర్పములను కర్ణాభరణములుగా ధరించి పార్వతితో కలసిన శివుడు - ఆహా భిన్న రూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను.

09. ఏతత్పఠేదష్టక మిష్టదం యో
భక్త్యా స మాన్యో భువి దీర్ఘజీవీ।
ప్రాప్నోతి సౌభాగ్య మనన్తకాలం
భూయాత్సదా తస్య సమస్తసిద్ధిః॥

కోరికలు తీర్చు ఈ ఎనిమిది శ్లోకముల స్తోత్రమును భక్తితో పఠించువాడు, ఆదరణీయుడై భూలోకమునందు చిరకాలము జీవించును. అనంత కాలము సౌభాగ్యమును పొందును. అతనికి ఎల్లప్పుడు అన్నీ సిద్ధించును.

ఎవరైతే ఈ ఎనిమిది శ్లోకాలను నిరంతరం భక్తితో స్మరిస్తారో, వారికి జగన్మాతా, పితరులైన పార్వతీ పరమేశ్వరులు అన్ని కోరికలను అనుగ్రహించి, అన్ని కార్యములను సిద్ధింపచేయడమే కాక, వారిని భూలోకమునందు దీర్ఘకాలము ఇతరులచే గౌరవింపబడే వారుగానూ, అనంత సౌభాగ్యములతో తులతూగేటట్లు ఆశీర్వదిస్తారు.

// ఇతి శ్రీ ఆదిశంకరాచార్యకృత అర్ధనారీశ్వర స్తోత్రమ్ సంపూర్ణమ్ //

- - - = - - - ఓం అర్ధనారీశ్వరాయై నమః - - - = - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. –944 044 9650, 994 994 1430)

Kiron Type Institute